## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

మద్దిపాడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల నాయకులంతా సోమవారం ఘనంగా నివాళులర్పించాలని పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు కోరారు. ఉదయం 10 గంటలకు మద్దిపాడులోని వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

### వర్షం నీరు సజావుగా ప్రవహించేలా చూడాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో వర్షం నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచిన పలు ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. డ్రెయిన్లను ఆక్రమించి సిమెంట్ పైపులతో మూసివేసిన ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి నీరు నిలుస్తున్న ప్రాంతాలను గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. పోతురాజు కాలువ చెత్తాచెదారంతో నిండిపోయి ఉండటాన్ని గుర్తించి పొక్లెయిన్ సాయంతో తొలగించారు. డీఈఈలు పద్మజ, గణపతి, ఎంహెచ్‌ఓ మనోహరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### వర్షం బాధితులకు భోజన ప్యాకెట్ల పంపిణీ

కొత్తపట్నం: వర్షం కారణంగా ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు ఆదివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కొత్తపట్నంలోని గంగమ్మ గుడి పక్కన అన్నా చెరువు ఒడ్డున నివసిస్తున్న పేద కుటుంబాలను పరామర్శించారు. ఇళ్లలోకి వర్షం నీరు చేరి అన్నం వండుకోవడానికి కూడా ఇబ్బందిపడుతున్నట్లు వారు చెప్పడంతో దాత, ఐకానిక్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత మిట్నసల అశోక్‌బాబు సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. ఆర్గనైజేషన్ టీం సభ్యులు డి.కేశవ, ఎం.సునీల్, రజిత్ పాల్గొన్నారు.

### జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు


చిన్నారులకు కథలు చెబుతున్న మాస్టర్ మోహన్

ఒంగోలు టౌన్: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిన్నారులకు కథలు చదివి వినిపించారు. అనంతరం చిన్నారుల చేతికి పుస్తకాలిచ్చి కథలు చదివించారు. జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. అనంతరం పర్సనాలిటీ డెవలప్మెంట్ గురించి, చిటికెలో లెక్కల చిక్కులను విప్పడం, చేతివేళ్ల ద్వారా కూడికలు, తీసివేతలు చేయడం లాంటివి నేర్పించారు. కంప్యూటర్ విద్యలో మెళకువలను చిన్నారులకు అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయంలోని ప్రతి పుస్తకంలోనూ ఒక్కో ప్రత్యేకమైన విషయం నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు. పుస్తకాలను చదవడం అలవరచుకోవడం వలన ప్రపంచాన్ని చదివినట్లని, అనేక విషయాలను గ్రహించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాలాది మోహన్, షిరిడీ సాయిరాం, లింగిశెట్టి అశోక్ కుమార్, సంపూర్ణమ్మ, అనిల్, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

### విశ్వహిందూ పరిషత్ అభివృద్ధికి కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

చీమకుర్తి: విశ్వహిందూ పరిషత్ అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘ జిల్లా నాయకుడు తూనుగుంట మల్లికార్జునరావు తెలిపారు. సంతనూతలపాడులోని వాసవీకల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయనతో పాటు స్థానిక విశ్వహిందూపరిషత్ నాయకులు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఏర్పడి 60 సంవత్సరాలైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అందించిన సేవలు, విజయాల తెలంగాణ, ఆంధ్రా సత్సంగ ప్రముఖులు సోమా సుబ్బారావు వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల, స్థానిక నాయకులు చక్కా సుబ్బరాయుడు, ఈమని బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులు పటిష్టంగా చేపట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు అర్బన్: భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు పటిష్టంగా చేపట్టాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కాలువల్లో, గుంతల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఫీవర్ సర్వే చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండి పారిశుధ్యం, సురక్షిత మంచినీరు, మెరుగైన విద్యుత్ సరఫరాపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.


# హ్యూమనాయిడ్ రోబోట్ కచ్చితత్వంగా పనిచేస్తుంది

- రైజ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమంలో టీఎల్‌సీ ఎడ్యుబోటిక్స్ టెక్నికల్ ఇంజినీర్ సురేంద్రబాబు


హ్యూమనాయిడ్ రోబోట్ గురించి వివరిస్తున్న కళాశాల బాధ్యులు, ప్రత్యేక నిపుణులు

ఒంగోలు సెంట్రల్: హ్యూమనాయిడ్ రోబోట్ మానవ కృత్రిమ మేధస్సుతో అత్యంత కచ్చితత్వంగా, వేగవంతంగా ఇచ్చిన పని పూర్తి చేస్తున్నాయని టీఎల్‌సీ ఎడ్యుబోటిక్స్ టెక్నికల్ ఇంజినీర్ పి.సురేంద్రబాబు తెలిపారు. రైజ్ కృష్ణసాయి, గాంధీ గ్రూప్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో గత మూడు రోజులుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హ్యూమనాయిడ్ రోబోట్ అనే అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శిద్దా భరత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా, సురేంద్రబాబు మాట్లాడుతూ రోబోట్‌లను మెడిసిన్, బయోటెక్నాలజీ, బయోమెకానిక్స్, కాగ్నటిక్ సైన్స్‌లో ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. రోబోటిక్స్‌లో నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ మాట్లాడుతూ విద్యార్థుల ఉపయోగార్థం యాజమాన్యం మంచి కోర్సుల్లో నైపుణ్యం సాధించే విధంగా శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక మాట్లాడుతూ మొదటిసారిగా ఇండియాలో ఇంజినీరింగ్ కళాశాలల్లో రోబోటిక్స్ తయారీ అడ్వాన్స్ టెక్నాలజీ శిక్షణను విద్యార్థులకు ఇప్పించిన ఏకైక సంస్థ రైజ్ కృష్ణసాయి, గాంధీ సంస్థలు అని తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, సీఎస్సీ, ఈసీఈ, విభాగపు అధిపతులు ప్రొఫెసర్ పి.ఐజాక్‌పాల్, ఎస్వీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షం నీరు


ఎంపీడీఓ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు

మద్దిపాడు: స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షం నీరు చేరింది. తహసీల్దార్ కార్యాలయానికి, పీహెచ్‌సీకి వెళ్లే సీసీ రోడ్డును ఎత్తుగా నిర్మించడంతో పాటు ఎంపీడీఓ కార్యాలయం లోతులో ఉండటంతో రోడ్డుపై ప్రవహించే వర్షం నీరు ఎంపీడీఓ కార్యాలయంలోకి చేరుతోంది. శనివారం అధికంగా వర్షం కురిసిన నేపథ్యంలో ఎంపీడీఓ గదిలోకి, ఎంపీపీ గదిలోకి, అడ్మినిస్ట్రేటివ్ రూంలోకి వర్షం నీరు చేరింది. దీనికితోడు మద్దిపాడు హైవే పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డులో నిలిచిపోయిన నీరు కూడా భారీ వాహనాలు వచ్చిన సమయంలో ఎంపీడీఓ కార్యాలయంవైపు చొచ్చుకొస్తోంది. మొత్తంమీద ఎంపీడీఓ కార్యాలయాన్ని వర్షం నీరు దిగ్బంధించింది. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోకుంటే వారితో పాటు సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు.

## 1,325 మందికి వైద్య సేవలు


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఒంగోలు టౌన్: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ప్రతి 2 నెలలకోసారి నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆదివారం స్థానిక నెల్లూరు బస్టాండులోని టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చారు. సుమారు 1,325 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. ఓపీ, టెక్నికల్, ఫార్మసీ, రిజిస్ట్రేషన్, కౌన్సిలింగ్ విభాగాలలో 130 మంది వలంటీర్లు పాల్గొని సేవలందించినట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు కొల్లా భారతి, గోపాలం శ్రీమన్నారాయణ, బి.హరిబాబు, సందీప్ ప్రకాశ్, జి.చైతన్య, ఎం.శరత్, రవితేజ, ధీరజ్‌బాబు, జె.దుర్గాప్రసాద్, చాపల వంశీకృష్ణ తదితరులు రోగులకు వైద్య సేవలు అందించి సలహాలు, సూచనలు చేశారు.

# 'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డోలా, పక్కన అధికారులు

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అధిక సంఖ్యలో రైతులకు ప్రయోజనం కలిగే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. సకాలంలో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాలు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిర్వహిస్తారన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్, బ్యాంకింగ్, విద్యుత్ మొదలైన వారు పాల్గొని పొలాలను సందర్శించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు. కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు. ఒంగోలు, సింగరాయకొండ ఏడీఏలు రమేష్, నిర్మలకుమారి, కొండపి, టంగుటూరు, జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయకొండ ఏఓలు విజయ్, స్వర్ణలత, యుగంధర్ రెడ్డి, పూర్ణచంద్రరావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

## రహదారి ఆక్రమణలను సహించం


నాగులుప్పలపాడు సెంటర్‌లో ఆక్రమణల తొలగింపులను పరిశీలిస్తున్న ఎస్ఐ

నాగులుప్పలపాడు (మద్దిపాడు): రహదారులను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగులుప్పలపాడులో జాతీయ రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారు తక్షణమే వారి హద్దులు సరిచేసుకోవాలని సూచించారు. పార్కింగ్ కూడా వారి హద్దులలోనే ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. నాలుగు కూడళ్ల సెంటర్‌లో రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని, దీని వలన వాహనాల రాకపోకలకు అసౌకర్యంతో పాటు ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రహదారులపై వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మరోసారి తాను వ్యక్తిగతంగా పరిశీలిస్తానని, రహదారులను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

# వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి


వినాయక విగ్రహ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న చీమకుర్తి సీఐ సుబ్బారావు

చీమకుర్తి: వినాయక చవితి సందర్భంగా చీమకుర్తి పట్టణంతో పాటు మండలంలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ముందస్తు అనుమతులు తీసుకోవాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. ఆదివారం చీమకుర్తి పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతంలో పర్యటించి విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులకు ముందస్తు సూచనలు చేశారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, బాణసంచా ద్వారా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా శాంతియుతంగా చేసుకోవాలన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేసే వారు ఐదుగురి సభ్యులతో కమిటీగా ఏర్పడి వారి పూర్తి వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

## ఎన్డీఏ పాలనలో పెరిగిన నిత్యావసరాల ధరలు

- నేటి నుంచి ఆందోళన కార్యక్రమాలు
- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

ఒంగోలు టౌన్: ఎన్డీఏ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ధరలు తగ్గిస్తామంటూ అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు వంట గ్యాస్ ధర రూ.400 ఉండగా, ఇప్పుడు రూ.950కి చేరిందని తెలిపారు. అదేవిధంగా కిలో బియ్యం రూ.70కు, కందిపప్పు రూ.210కు, వేరుశనగ నూనె రూ.220కు చేరిందని వివరించారు. ఈ 10 ఏళ్లలో 200 శాతం ధరలు పెరిగిపోయాయని, అయినప్పటికీ తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు. హోల్‌సేల్ వ్యాపారులు, దళారులు కుమ్మక్కై నిత్యావసరాల అక్రమ కొరత సృష్టించడం ద్వారా ధరలు పెంచి దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రభుత్వం దళారుల మీద కఠిన చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోందని అన్నారు. సోమవారం నుంచి 6వ తేదీ వరకు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 6వ తేదీ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో కారుమూడి నాగేశ్వరరావు, బోడపాటి సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వరరావు, ఎస్‌కే రవూఫ్, ఎంఏ సాలార్, కల్లూరు లక్ష్మయ్య, రవిచంద్ర, సిద్దయ్య, సుధాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

కొత్తపట్నం: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కొత్తపట్నం తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వాయుగుండం తీరం దాటిన తర్వాత అధిక వర్షం పడే అవకాశం ఉందని, మీరంతా గ్రామాల్లోనే ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. వాగులు, కాలువలు పొంగి పొర్లుతుంటే జనం ఆ ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాల తీవ్రత మరో రెండు రోజులపాటు ఉంటుందని, పంచాయతీ, సచివాలయ సిబ్బంది మూడు టీంలుగా ఏర్పడి 24 గంటలూ డ్యూటీ చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలకు ఎక్కడైనా గృహాలు పడిపోయినా, గేదెలు చనిపోయినా, పంట నష్టం వాటిల్లినా సంబంధిత అధికారి గుర్తించి వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ వర్షాల కారణంగా అన్ని పంచాయతీల్లో రోడ్ల వెంట సున్నం, బ్లీచింగ్ వేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవసరమైతే గ్రామాల్లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, మెడికల్ ఆఫీసర్ నవ్యారెడ్డి, పశువైద్యాధికారిని అనూష, ఏఏవో మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఏఎస్‌వో కోటేశ్వరరావు, హెచ్‌వో తేజ, హాస్టల్ వార్డెన్ అరుణ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ సమావేశాన్ని జయప్రదం చేయండి

చీమకుర్తి: మండలంలోని రామతీర్థంలో గల వీటీసీ కేంద్రంలో ఈ నెల 4వ తేదీ నిర్వహించే గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ సమావేశాన్ని జయప్రదం చేయాలని చీమకుర్తి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర తెలిపారు. ఆదివారం చీమకుర్తిలోని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులను కలిసి సమావేశానికి హాజరుకావాలని కోరారు. చీమకుర్తి, బూదవాడ, మర్రిచెట్లపాలెం, ఏలూరు రోడ్డు, ఆర్ఎల్ పురం ప్రాంతాలకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ సభ్యులంతా హాజరుకావాలన్నారు. సంక్షోభంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవడానికి అనుసరించాల్సిన పరిస్థితులపై చర్చించేందుకు ప్రతిఒక్క ఫ్యాక్టరీ యజమాని హాజరుకావాలని కోరారు.

## తెలుగు పండిట్‌కు డాక్టరేట్

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని చిలకపాడు గ్రామానికి చెందిన తెలుగు పండిట్ పరాంకుశం మరుత్ కుమార్ ఆత్రేయకు తమిళనాడులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 38 సంవత్సరాలుగా జెడ్పీ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పనిచేస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అనేక అవధానాల్లో పృచ్ఛకులుగా సాహిత్య సేవ చేశారు. అనేక మందికి యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. సాహిత్య సమావేశాలు, సభలు నిర్వహిస్తూ ప్రజలను విపత్కర పరిస్థితుల్లో కూడా చైతన్యవంతులను చేశారు. పీఆర్‌టీయూ టీచర్స్ యూనియన్ ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం అందుకున్నారు. టీటీడీలో వ్యాఖ్యాతగా కూడా పనిచేసిన ఆమెకు డాక్టరేట్ రావటంపై ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# గిన్నిస్‌బుక్ రికార్డు లక్ష్యంగా రక్తదాన శిబిరాలు


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ వారోత్సవాల సందర్భంగా గిన్నిస్ బుక్ రికార్డు సాధనలో భాగంగా ఆరు రాష్ట్రాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు క్లబ్ అంతర్జాతీయ కోశాధికారి శిద్దా సూర్యప్రకాశరావు తెలిపారు. వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ యూత్, ఒంగోలు వారు సంయుక్తంగా స్థానిక దక్షిణం బజారులోని సంపత్ కుమార్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపులో సూర్యప్రకాశరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వాసవీ క్లబ్స్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేనగుప్త జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే వాసవీ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ నిర్దేశించిన రక్త సేకరణలో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించడమే కాకుండా సామాజిక సేవలో వాసవీ క్లబ్ సభ్యులు ముందుంటారని తెలియజెప్పడం, ప్రాణదాతలుగా సమాజానికి మరింత విస్తృత సేవలు అందించడం లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల గురించి వివరించారు. వాసవీ క్లబ్ జిల్లా 205లో బ్లడ్ డొనేషన్ కార్యక్రమాల ఇన్‌చార్జ్ జి.బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లాలోని 60 క్లబ్స్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాయని, ఒంగోలు నగరంలోని క్లబ్స్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ్య, విజన్ బ్లడ్ బ్యాంకుల సహకారంతో 70 యూనిట్ల రక్తం సేకరించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు క్లబ్ అధ్యక్షుడు నల్లమల్లి బదరినారాయణ, యూత్ అధ్యక్షుడు కూనల శ్రీనివాసరావు, వాసవీ క్లబ్, అద్దంకి ప్రతినిధి వీవీ ఆదినారాయణ, వనిత ప్రెసిడెంట్ వి.విజయలక్ష్మి, జిల్లా బ్లడ్, ఆర్గాన్ డొనేషన్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్ దర్శి మనోహర్ చంద్రశేఖర్, వీసీఐ డైరెక్టర్ ఉమా అన్నపూర్ణ, జిల్లా అధికారులు, క్లబ్ కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు. రక్తదాతలకు ప్రోత్సాహక కానుకలు అందించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

# భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు


ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వనాథుడు


గాంధీనగర్ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో...

ఒంగోలు మెట్రో: శివునికి ప్రీతికరమైన శ్రావణమాసంలో చతుర్దశి ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా నగరంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ప్రదోషకాలంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కేశవస్వామిపేటలోని కాశీవిశ్వనాథుని దేవాలయంలో, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులోని సాయిశివ పంచముఖ క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్‌లో హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామికి, గాంధీనగర్లో రామలింగేశ్వరస్వామికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, సమతానగర్లోని సాగర్ కాలువ దగ్గర దుర్గామల్లేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రదోషకాలంలో శివలింగం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి శివునికి ప్రీతికరమైన బిల్వ దళాలతో శివ అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. కర్పూర హారతులతో భక్తులకు స్వామివారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఎస్పీ కార్యాలయం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


హరికృష్ణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కామేపల్లి హరికృష్ణ (52) శనివారం రాత్రి గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి ఆదివారం ఎస్పీ ఏఆర్ దామోదర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు. పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎస్పీ వెంట ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, తాలూకా సీఐ అజయ్ కుమార్, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.